క్లుప్తంగా

22 నుంచి గంగాభవాని ఉత్సవాలు

ఉదయగిరి : మండలంలోని గంగిరెడ్డిపల్లి గ్రామంలో ఉన్న అనంతపురి గంగాభవాని అమ్మవారి ఉత్సవాలు ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. 22న అమ్మవారికి కల్యాణోత్సవం, గ్రామోత్సవం, 23న ఉదయం వసంతోత్సవం, రాత్రికి గ్రామోత్సవం, 24న గంగాభవాని అమ్మవారికి కుంకుమ మహాపూజ, గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు.

విద్యాసామగ్రి వితరణ



అల్లూరు : మండలంలోని నార్తుమోపూరులో ఉన్న ప్రజా పరిషత్ పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులకు నోట్ పుస్తకాలు, విద్యాసామగ్రిని దాత కోలపర్తి హజరత్ బాబు బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు టి.వెంకటేశ్వర్లు, బి.రవీంద్రబాబు, షేక్.కాలేషా, కమిటీ చైర్మన్ ఎస్.చిన్ని తదితరులు పాల్గొన్నారు.

‘మా జీతాలు పెంచండి’

• స్వీపర్ల ఆవేదన



మాట్లాడుతున్న స్వీపర్లు

ఆత్మకూరురూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో స్వీపర్లుగా పనిచేస్తున్న తమకు జీతాలు పెంచాలని వారు కోరారు. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. ప్రతిరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాలలోనే ఉండి పనిచేస్తున్న తమకు నెలకు రూ.6 వేలు మాత్రమే జీతం ఇస్తున్నారని, ప్రస్తుతం పెరిగిన నిత్యావసరాలతో వచ్చే జీతంతో కుటుంబ పోషణ కష్టంగా ఉందన్నారు. విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నారా లోకేశ్ తమ సమస్యల పరిష్కారం పట్ల స్పందించి న్యాయం చేయాలని కోరారు.

అదుపుతప్పిన కారు

ఉదయగిరి : మండలంలోని సర్వరాబాద్ సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం కారు అదుపుతప్పి చెట్లలోకి దూసుకెళ్లింది. దీంతో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రకాశం జిల్లా సింగరాయకొండకు చెందిన బీటెక్ విద్యార్థులు కారులో బైరవకోనకు బయల్దేరారు. ఈ క్రమంలో సర్వరాబాద్ సమీపంలో కారు అదుపుతప్పి ముళ్ల పొదలపై నుంచి రాళ్లగుట్టపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇద్దరికి స్వల్పగాయాలు కావడంతో కారు ముందు భాగం దెబ్బతింది. దీనిపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

వైభవంగా అమ్మవారి ఊరేగింపు

కొండాపురం : మండలంలోని గొట్టిగుండాలలో ఉన్న కోట అంకమ్మతల్లి తిరునాళ్ల సందర్భంగా అమ్మవారి ఊరేగింపు మంగళవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. తొలుత అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి రథంపై కొలువుదీర్చారు. అనంతరం గ్రామ వీధుల్లో ఊరేగించారు. గ్రామోత్సవం సందర్భంగా ప్రజలు అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ క్రమంలో బుధవారం వేకువజామున ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

బగులోలకుంటలో పూడికతీత పనులు

మర్రిపాడు : మర్రిపాడులోని బగులోలకుంటలో కాలువ పూడికతీత పనులను ఐటీసీ సెర్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ కమ్యూనిటీ ఆర్గనైజర్ ప్రకాష్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులకు ఉపయోగపడే విధంగా పనులు చేస్తామని వెల్లడించారు.

భూ ఆక్రమణను అడ్డుకున్న అధికారులు

ఉదయగిరి : మండలంలోని శకునాలపల్లి సచివాలయం వెనుక వైపు ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తుండగా రెవెన్యూ అధికారులు బుధవారం అడ్డుకున్నారు. గ్రామంలో సర్వే నంబర్ 40లో మూడెకరాల వాగు పోరంబోకు భూమిని చదును చేసి ఆక్రమించుకునే ప్రయత్నం చేశారు. దీనిని కొందరు గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వీఆర్వో అనూష తన సిబ్బందితో వెళ్లి అడ్డుకున్నారు.

ముమ్మరంగా ‘నేను బడికి పోతా’

ఆత్మకూరురూరల్ : మండలంలోని పలు గ్రామాల్లో నేను బడికి పోతా కార్యక్రమం ముమ్మరంగా జరుగుతోంది. ఇందులో భాగంగా ఉపాధ్యాయులు పలు గ్రామాల్లో బుధవారం పర్యటించి చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న సదుపాయాలను వివరించారు. బండారుపల్లి, అశ్వనీపురం, బసవరాజుపాళెం, వెంకట్రావుపల్లి మెయిన్, ఎంపీయూపీఎస్ ఆత్మకూరు ఉర్దూ, ఎంపీపీఎస్ కరటంపాడు జీసీ, పడకండ్ల తదితర ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు పలువురు చిన్నారులను చేర్పించారు.

తీవ్రంగా నష్టపోయాం.. ఆదుకోండి

• కేంద్ర బృందానికి మొరపెట్టుకున్న రైతులు



కలిగిరి: గంగిరెడ్డిపాళెంలో పంట నష్టం వివరాలను కేంద్ర బృందానికి వివరిస్తున్న స్థానిక అధికారులు

కలిగిరి : ఈ రబీ సీజన్‌లో కరువు వల్ల తీవ్రంగా నష్టపోయాం.. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆదుకోవాలని స్థానిక రైతులు కేంద్ర బృందానికి మొరపెట్టుకున్నారు. మండలంలోని గంగిరెడ్డిపాళెం, తెల్లపాడు గ్రామాల్లో రబీ సీజన్‌కు సంబంధించిన నష్టాలను అంచనా వేసేందుకు కేంద్ర బృంద సభ్యులు బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. కేంద్ర అధికారులు మన్ను ఉపాధ్యాయ్, క్యాసప్, మదన్‌మోహన్ మౌర్య, అనూరాధలు రబీలో సాగు చేసిన పొలాలను పరిశీలించారు. అనంతరం గంగిరెడ్డిపాళెం, తెల్లపాడు గ్రామ సచివాలయాల్లో రైతులతో ముఖాముఖి సమావేశాలు నిర్వహించి అభిప్రాయాలు సేకరించారు. గంగిరెడ్డిపాళెంలో పలువురు రైతులు నీటి కొరతతో పశువుల మేతకు తీవ్ర కొరత ఏర్పడిందన్నారు. భూగర్భ జలాలు అడుగంటి గ్రామాల్లోకి వచ్చే రక్షిత తాగునీటి పథకం బోర్లు కూడా పనిచేయడం లేదన్నారు. ప్రభుత్వం ద్వారా సరఫరా చేసే విత్తనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తెల్లపాడులో పలువురు మాట్లాడుతూ ఉపాధిహామీ పనులను ఉపయోగకరంగా జరిగేలా చూడాలన్నారు. కేవలం 13 మందికి మాత్రమే నష్ట పరిహారం అందడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. రబీ సీజన్‌లో వర్షాలు లేక పంటలు ఎండిపోయి నష్టపోయామన్నారు. రైతుల అభిప్రాయాలను ఆలకించిన కేంద్ర బృందం సభ్యులు జరిగిన నష్టాన్ని అంచనా వేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందజేసి ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారిణి పి.సత్యవాణి, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి మహేశ్వరుడు, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటరమణ, ఉద్యానశాఖ అధికారిణి దీపిక, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అధికారి వీరశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గొట్టిగుండాలలో..

కొండాపురం : మండలంలోని గొట్టిగుండాల పంచాయతీలో 2023–24 ఏడాదిలో వర్షాభావ పరిస్థితిలో నష్టపోయిన పంటలను పరిశీలించేందుకు కేంద్ర బృందం బుధవారం సాయంత్రం పర్యటించారు. ఈ సందర్భంగా ఆ పంచాయతీలో సుమారు 600 ఎకరాల్లో మినుము, మిరప పంటలను రైతులు పూర్తిస్థాయిలో నష్టపోయారని వ్యవసాయ శాఖ అధికారులు కేంద్ర బృందం సభ్యులు మున్నన్ ఉపాధ్యాయ్, మదన్‌మోహన్ మౌర్యా, అనూరాధ, దీపికలకు వివరించారు. ఈ నివేదికను గతంలోనే రాష్ట్ర ప్రభుత్వానికి అందించామని వారికి తెలిపారు. నష్టపోయిన భూములను కేంద్ర బృందం పరిశీలించింది. వారి వెంట జిల్లా వ్యవసాయాధికారిణి పి.సత్యవాణి, వింజమూరు ఏడీఏ రామిరెడ్డి, కొండాపురం ఇన్‌చార్జి ఏఓ శ్రీహరినారాయణ, తహసీల్దార్ మస్తానయ్య, గొట్టిగుండాల వీఆర్వో తిరుపతయ్య, పంచాయతీ కార్యదర్శి శేఖర్, ఎంపీటీసీ వేమిరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి, ఏఈఓ కందుకూరి ఈశ్వరాచారి, అగ్రికల్చర్ అసిస్టెంట్ లావణ్య, పలు శాఖల అధికారులు ఉన్నారు.



కలిగిరి: తెల్లపాడులో రికార్డులు పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

శాస్త్రోక్తంగా ధ్వజారోహణ

• దువ్వూరులో ప్రారంభమైన కోటేశ్వరుని బ్రహ్మోత్సవాలు



ధ్వజారోహణ కార్యక్రమాన్ని జరిపిస్తున్న అర్చకులు

సంగం : హరహర మహాదేవ.. శంభోశంకరా అంటూ మండలంలోని దువ్వూరులో కొలువైన శ్రీగంగా పార్వతి సమేత కోటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. అంకురార్పణతో బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. ధ్వజారోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వస్తిశ్రీ క్రోధి నామ సంవత్సర జ్యేష్ఠ ద్వాదశి మంగళవారం మొదలై ఈనెల 26వ తేదీ వరకు ఈ వేడుకలు జరుగుతాయి. ఈ సందర్భంగా ప్రతిరోజు స్వామి, అమ్మవార్లు వివిధ రకాల అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. ఇందులో భాగంగా బుధవారం ఉదయం ధ్వజారోహణ జరిపించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చప్పర ఉత్సవం, రాత్రి రావణ సేవ గావించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 21న గిన్నెభిక్ష, రాత్రి నందిసేవ, 22న ఉదయం చప్పర ఉత్సవం, రాత్రి అంబారి సేవ, 23న ఉదయం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం, రాత్రి తీర్థవాది, పురుషామృగసేవ, 24న ఉదయం ధ్వజావరోహణ, రాత్రి అలకలతోపు, అశ్వవాహన సేవ, 25న రాత్రి శేషవాహన సేవ, 26న రాత్రి ఏకాంతసేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని వేద పండితుడు శివకుమారస్వామి తెలిపారు.

బడిబాటను జయప్రదం చేయండి



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులను చేరుస్తున్న సిబ్బంది

సోమశిల : మండల పరిధిలో బడిబాట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఇన్‌చార్జి సూపర్‌వైజర్ కాకూరు నాగమణి కోరారు. అనంతసాగరం మండలం రేవూరు గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో 12 మంది పిల్లలను చేర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండలంలో బడిబాట కార్యక్రమం ద్వారా అంగన్‌వాడీ కేంద్రంలో నాలుగేళ్ల పిల్లలను చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు రమేష్ బాబు, అంగన్‌వాడీ వర్కర్ జి.సుబ్బమ్మ, హెల్పర్ భగవతి, హెల్త్ సూపర్‌వైజర్ శారదమ్మ, ఏఎన్‌ఎం పెంచలమ్మ, ఆశా వర్కర్ అన్వర్‌జాన్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల సమస్యల పరిష్కారమే ఏపీటీఎఫ్ లక్ష్యం



వరికుంటపాడు : సభ్యత్వ నమోదు చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు



వింజమూరు బీసీ కాలనీలో చేపడుతున్న సభ్యత్వ నమోదు

వరికుంటపాడు : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఏపీటీఎఫ్ సంఘం పనిచేస్తుందని ఆ సంఘ జిల్లా కార్యదర్శి డి.మాల్యాద్రి తెలిపారు. మండలంలోని తిమ్మారెడ్డిపల్లి, తూర్పు రొంపిదొడ్ల, గణేశ్వరపురం, రామదేవులపాడు, జడదేవి, కనియంపాడు, వరికుంటపాడు తదితర గ్రామాల్లోని పాఠశాలల్లో ఏపీటీఎఫ్ సభ్యత నమోదు కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించేందుకు ఉద్యమాలు చేపట్టే దిశలో తమ సంఘం ముందుంటుందన్నారు. ఇప్పటివరకు ఉపాధ్యాయుల సమస్యలను ఎన్నో పరిష్కరించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు బాలకృష్ణ, జిలాని, బాషా మాల్యాద్రి, తిరుపతయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి, నిస్సార్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు

వింజమూరు(ఉదయగిరి) : వింజమూరు మండలంలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో టీచర్ల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు వేములపాటి శివకోటారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై ఏపీటీఎఫ్ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. ఉపాధ్యాయ హక్కులు, బాధ్యతలను నిరంతరం గుర్తు చేస్తూ సమాజ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నట్లు చెప్పారు. ఉత్తమ విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు క్రియాశీలకంగా వ్యవహరించేలా సంఘం నిరంతరం కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండలాధ్యక్షుడు పి.కొండారెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు పేరం మల్లికార్జునరావు, గుర్రం నారాయణ, యు.ప్రసాద్‌రెడ్డి, ఎం.శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

23న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమావేశం

ఉదయగిరి : వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం ఈనెల 23వ తేదీ ఉదయం 10 గంటలకు బ్రహ్మణపల్లిలోని పార్టీ కార్యాలయంలో జరుగుతుందని మేకపాటి కార్యాలయ సిబ్బంది బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి వైఎస్సార్‌సీపీకి చెందిన జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పార్టీ మండలాధ్యక్షులు, జేసీఎస్ కన్వీనర్లు, బూత్ కమిటీ సభ్యులు, మండల, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు, పార్టీ అనుబంధ సంఘాల బాధ్యులు తప్పక హాజరుకావాలని కోరారు.

కోదండరామస్వామికి ప్రత్యేక పూజలు

ఉదయగిరి : పట్టణంలోని బ్రాహ్మణవీధిలో ఉన్న కోదండరామస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారికి గణపతిపూజ, అభిషేకాలు, హోమాలు చేశారు. అనంతరం స్వామివారికి కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

వేడుకగా వరదరాజస్వామి గ్రామోత్సవం



అల్లూరు : మండల పరిధిలోని నార్తుమోపూరు గ్రామంలో కొలువైన వరదరాజస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వామివారి గ్రామోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం స్వామివారిని విశేష పూలతో అలంకరించారు. ప్రత్యేక వేదికపై వరదరాజస్వామిని కొలువుదీర్చి గ్రామోత్సవాన్ని గావించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

మాతాపరమేశ్వరికి విశేషాలంకరణ



డ్రైఫ్రూట్స్‌తో మాతాపరమేశ్వరికి విశేషాలంకరణ



ఆత్మారామస్వామికి గ్రామోత్సవం

సంగం : సంగం మండల కేంద్రం అరుంధతీయవాడలో మాతాపరమేశ్వరి జాతర మహోత్సవ వేడుకల్లో భాగంగా అమ్మవారిని బుధవారం విశేషంగా అలంకరించారు. ఈ సందర్భంగా వివిధ రకాల డ్రైఫ్రూట్స్‌తో అలంకరించిన మాతా పరమేశ్వరిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు.

యాళి వాహనంపై ఆత్మారాముడు

మండలంలోని అన్నారెడ్డిపాళెం ఆత్మారామస్వామి ఆలయంలో ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అర్ధరాత్రి యాళి వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆత్మారామస్వామిని యాళి వాహనంపై కొలువుదీర్చి విశేష పూలతో శోభాయమానంగా అలంకరించారు. వేద పండితులు ప్రత్యేక పూజలు చేసి గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు ఇళ్ల ముంగిటకు వచ్చిన ఆత్మారామునికి కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు పట్టారు.

వ్యాధులపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు స్వప్నారెడ్డి

సీతారామపురం : మలేరియా వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా స్థానిక జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు కీటకజనిత వ్యాధులపై వైద్యాధికారిణి స్వప్నారెడ్డి బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఇంటి పరిసరాల్లో నీటినిల్వలు లేకుండా చూసుకోవాలని, మురుగు చేరితే మలేరియా జ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకుంటూ దోమతెరలు వినియోగించాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి నీటి నిల్వలు తొలగించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడి ఆహారం తీసుకోవాలని సూచించారు. ఎవరైనా రెండ్రోజులకు మించి జ్వరంతో బాధపడుతుంటే వెంటనే పీహెచ్‌సీ మలేరియా పరీక్షలు చేయించుకుని వైద్యసేవలు పొందాలన్నారు. అనంతరం గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉదయగిరి సబ్‌యూనిట్ అధికారి నౌషాద్‌బాబు, ఎంపీహెచ్‌ఎస్‌లు భోగ్యం వెంకటేశ్వర్లు, రియాజ్, పాఠశాల ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టూడెంట్ కిట్ల పంపిణీ



పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న ఎంఈఓ

వరికుంటపాడు : మండల కేంద్రమైన వరికుంటపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన స్టూడెంట్ కిట్లను ఎంఈఓ షావుద్దీన్, పాఠశాల హెచ్‌ఎం వీరభద్రయ్య బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉజ్వల భవిష్యత్తు పొందాలన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రమశిక్షణ అలవర్చుకుని విద్యలో రాణించాలని సూచించారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. అనుకున్న లక్ష్యాన్ని సాధించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆపస్ సభ్యత్వ నమోదు



వెన్నవాడలో సభ్యత్వ నమోదు చేస్తున్న నాయకులు

ఆత్మకూరురూరల్ : ఆపస్(ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం) సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం నిర్వహించారు. ఆ సంఘ జిల్లా నాయకుడు అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని వెన్నవాడ, దేపూరు, మహిమలూరు, బండారుపల్లి తదితర గ్రామాల్లో పర్యటించి ఆపస్ యూనియన్‌లో ఉపాధ్యాయులకు సభ్యత్వం ఇచ్చారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

వెంగమాంబ బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక బస్సులు



డిపో సిబ్బందితో సమీక్షిస్తున్న డీఎం శ్రీనివాసరావు

ఉదయగిరి : దుత్తలూరు మండలం నర్రవాడలో కొలువైన వెంగమాంబ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 26వ తేదీన ఉదయగిరి డిపో నుంచి 25 ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతామని డిపో మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. ఉదయగిరి పట్టణంలోని డిపోలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. బ్రహ్మోత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్న నేపథ్యంలో ఉదయగిరి, సీతారామపురం, బద్వేలు, పోరుమామిళ్ల నుంచి ప్రత్యేక బస్సులు సాధారణ చార్జీలతో నడపనున్నట్లు చెప్పారు. భక్తులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం సిబ్బందితో సమీక్షించారు.

ఇస్కపల్లి పాఠశాలకు విద్యాప్రవేష్ బృందం



విద్యార్థులకు సూచనలిస్తున్న బృంద సభ్యులు

అల్లూరు : మండలంలోని ఇస్కపల్లి పట్టపుపాళెంలోని ప్రాథమిక పాఠశాలను కేంద్ర ప్రభుత్వ విద్యాప్రవేష్ బృందం బుధవారం సందర్శించింది. న్యూఢిల్లీ నుంచి ఎన్‌సీఈఆర్‌టీ ప్రొఫెసర్ డాక్టర్ జూబిలి పద్మనాభన్, సమగ్రశిక్ష నెల్లూరు అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ జి.సుధీర్‌బాబు, పల్లిపాడు ఉపన్యాసకుడు కె.వి జయచంద్ర పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ పద్మనాభన్ మాట్లాడుతూ విద్యాప్రవేష్ కార్యక్రమం జాతీయ విద్య శిక్షణా పరిశోధన మండలి ప్రవేశ పెట్టిందని, ఆరేళ్ల నిండి ఒకటో తరగతిలోకి ప్రవేశించిన విద్యార్థుల కోసం ప్రారంభించిన 90 రోజుల కార్యక్రమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల్లో సమగ్రశిక్ష ఆధ్వర్యంలో జరుగుతున్నట్లు తెలిపారు. ఒకటో తరగతి పిల్లల్లో సహజంగా ఉండే నైపుణ్యాలను వివిధ రకాల కృత్యాలు, ఆటపాటల ద్వారా వెలికి తీయడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ సునీత, హెచ్‌ఎం ఐ.చెంచుసుబ్బయ్య, ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ పి.నాగరాజారావు, గోపాల్, ఒ.వెంకటేశ్వరరాజు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న బైక్

• ఇద్దరికి గాయాలు

అనుమసముద్రంపేట : బైక్ ఆటోను ఢీకొన్న ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఏఎస్‌పేట మండలంలోని అక్బరాబాద్ వద్ద బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. ఏఎస్‌పేట మండలం అనుమసముద్రంకు చెందిన ఇద్దరు వ్యక్తులు స్కూటీలో కలిగిరికి వెళ్లి తిరిగి వస్తుండగా అక్బరాబాద్ వద్ద ఆటోను ఢీకొన్నారు. ఇందులో ఇద్దరు తీవ్రంగా గాయపడడంతో 108 అంబులెన్స్‌లో ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు తరలించారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో ఆయన్ను వెంటనే నెల్లూరుకు తరలించారు. గాయపడిన వ్యక్తికి ప్రథమ చికిత్స చేశారు. అయితే ఈ ఘటనపై పోలీసులకు సమాచారం లేదు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

సికిల్‌సెల్ అనీమియాపై అవగాహన తప్పనిసరి



సీతారామపురంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

సీతారామపురం : సికిల్‌సెల్ అనీమియా వ్యాధిపై ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని మండల వైద్యాధికారిణి స్వప్నారెడ్డి తెలిపారు. ప్రపంచ సికిల్‌సెల్ అనీమియా డే సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ఆమె బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సికిల్‌సెల్ అనీమియా వారసత్వంగా వచ్చిన ఎర్ర రక్తకణాల రుగ్మతల సమూహమన్నారు. ఈ వ్యాధి గిరిజన ప్రాంతాల్లో ఎక్కువగా కనిపిస్తుందని, కళ్లు పసుపు రంగులోకి మారి తీవ్రమైన శరీర నొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అలసట వంటివి ఈ వ్యాధి లక్షణాలన్నారు. పుట్టినప్పటి నుంచి 40 ఏళ్లలోపు వయస్సున్న గిరిజనులందరూ తప్పనిసరిగా రక్తపరీక్షలు చేయించుకోవచ్చన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా ట్రీట్‌మెంట్ ఇస్తామన్నారు. సికిల్‌సెల్ అనీమియా అంటువ్యాధి కాదని, జన్యుపరంగా తల్లిదండ్రుల నుంచి మాత్రమే సోకుతుందన్నారు. విపరీతమైన వాతావరణ పరిస్థితుల్లో ఉండకుండా సమతుల్య పౌష్టికాహారంతో పాటు శరీరంలో తగినంత నీటిశాతం ఉండేలా చూసుకుంటూ వ్యాధి వ్యాప్తిని నియంత్రించవచ్చన్నారు. అనంతరం వ్యాధి వ్యాప్తి, లక్షణాలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు వైద్యురాలు భవ్యశ్రీ, ఎంఎల్‌హెచ్‌పీలు, వైద్యసిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

అనుమసముద్రంపేట : ఏఎస్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మంజులమ్మ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ నుంచి ఏఎస్‌పేట బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ సాగింది. అనంతరం బస్టాండ్ సెంటర్ వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మంజులమ్మ మాట్లాడుతూ సికిల్‌సెల్ అనీమియా వ్యాధికి చికిత్స లేదని, రక్తంలోని మార్పు ద్వారా వస్తుందని తెలిపారు. ఈ వ్యాధి ఉన్న వారు పెళ్లి చేసుకోకూడదని, రక్త పరీక్షల ద్వారా వ్యాధిని గుర్తించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ చిన్నయ్య, పీహెచ్ఎన్ నీరజ, హెచ్‌వీ కుమార్, హెచ్ఎస్ రషీద్, ఏఎన్‌ఎంలు సర్తాజ్, శాంతకుమారి, విజిత, మాధురి, ఎంఎల్‌హెచ్‌పీ రహంతున్నీసా, ప్రతిమ, ఎంపీహెచ్‌ఏ ఫణి, శ్రీను, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



అనుమసముద్రంపేట : అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది